# నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ

- ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ
- నామపత్రాల దాఖలుకు ఈ నెల 10 వరకు గడువు
- జనరల్ అభ్యర్థులకు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.5 వేల డిపాజిట్
- 13న స్క్రూటినీ.. పోటీకి అర్హత ఉన్న అభ్యర్థుల వివరాల వెల్లడి
- ఉపసంహరణకు 15 వరకు అవకాశం..
- అదే రోజు తుది జాబితా ప్రకటన
- నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు: ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఈ నెల 30న జరుగనున్న శాసనసభ ఎన్నికల కోసం శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. శుక్రవారం నుంచి శాసనసభా నియోజకవర్గ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారులు పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ ప్రక్రియ 10 వరకు కొనసాగనుంది. ఇందుకోసం అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అధికారులు పోటీ చేసే అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు, నియమాలు, అవసరమైన ధ్రువపత్రాల వివరాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థులు అనుసరించాల్సిన పద్ధతులు, జాగ్రత్తలను వివరించేందుకు కార్యాలయంలో సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం నుంచి నామినేషన్లు ప్రారంభమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రీయ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు చెల్లించే డిపాజిట్లు ఒకే రకంగా ఉన్నాయి. జనరల్ స్థానం నుంచి పోటీ చేసే జనరల్ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ స్థానాలు లేదా జనరల్ స్థానాల నుంచి పోటీ చేసే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలను డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అభ్యర్థులు నోటరీ ద్వారా తమ ఆస్తులు, ఆదాయ వ్యయాలతోపాటు తమపై ఉన్న కేసుల వివరాలను నామినేషన్ పత్రాల్లో చూపించాల్సి ఉంటుంది. నామినేషన్ వేస్తున్న అభ్యర్థుల పేరు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఓటర్ల జాబితాలో తప్పనిసరిగా నమోదై ఉండాలి. అభ్యర్థుల ప్రతిపాదకులు కూడా స్థానిక నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి ఉండాలి. ప్రతి అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖాలు చేసేందుకు కమిషన్ అవకాశం కల్పించింది. ఈ నెల 10న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉంది. వచ్చిన నామినేషన్లను 13న స్క్రూటినీ చేస్తారు. పోటీలో ఉండేందుకు అర్హత ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. అదే రోజు నుంచి 15వ తేదీ సాయంత్రం వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. ఆ గడువు ముగిసిన వెంటనే ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు. నామినేషన్లు స్వీకరించే ఆర్వో కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయానికి 100 మీటర్ల వరకు నిర్దేశించిన వారిని మాత్రమే అనుమతిస్తారు. పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేయనున్నారు.

### పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్ వీపీ గౌతమ్

జిల్లాలో నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. ఖమ్మం రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఖమ్మం రిటర్నింగ్ అధికారి ఆదర్శ్ సురభి, పాలేరు రిటర్నింగ్ అధికారి ఎం.రాజేశ్వరి, ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, తహసీల్దార్లు రామకృష్ణ, సీహెచ్ స్వామి, అధికారులు పాల్గొన్నారు.

# ఇల్లెందులో 50 వేల మెజార్టీ తథ్యం

- ప్రజా ప్రభంజనంతో ఆశీర్వాద సభ విజయవంతమైంది
- డిసెంబర్ 3న బొగ్గుట్ట గులాబీమయమవుతుంది: వద్దిరాజు
- ప్రజల ఆశీర్వాదంతో మరింత అభివృద్ధి: హరిప్రియానాయక్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ, పక్కన ఎంపీ రవిచంద్ర

ఇల్లెందు, నవంబర్ 2: ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియకు 50 వేల మెజార్టీ తథ్యమని రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ ఇల్లెందు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. ఇటీవలి సీఎం ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన స్పందనను చూస్తుంటే అదే స్పష్టమవుతోందని అన్నారు. నియోజకవర్గ ప్రజల ఆదరణతో ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైందని అన్నారు. ఇల్లెందులోని బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు దాదాపు 80 వేల మంది హాజరయ్యారని, ఇంతటి పెద్ద సభను ఈ మధ్య కాలంలో ఎన్నడూ చూడలేదని అన్నారు. సభ విజయం పట్ల ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. ఎమ్మెల్యే హరిప్రియ అడిగిన అన్ని సమస్యలనూ సీఎం పరిష్కరిస్తారని అన్నారు. సభ విజయవంతం చేసిన విధంగానే ఎన్నికల్లో గెలిచేందుకు రానున్న 28 రోజులు కష్టపడి పనిచేద్దామని పార్టీ శ్రేణులకు సూచించారు. తన బిడ్డలాంటి హరిప్రియను గెలిపించాలని సీఎం కేసీఆర్ ఇక్కడి ప్రజలను పిలుపునిచ్చారని అన్నారు. అందుకు అనుగుణంగా ఈ నెల 30న కారు గుర్తుపై ఓటు వేసి అఖండ విజయాన్ని అందించాలని, డిసెంబర్ 3న ఇల్లెందును గులాబీమయం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

### ప్రజల ఆశీర్వాదంతో మరింత అభివృద్ధి: హరిప్రియానాయక్

బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ మాట్లాడుతూ.. మరోసారి కూడా తనను గెలిపిస్తే ప్రజల ఆశీర్వాదం, ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. ఇక్కడి ప్రజల అనేక సమస్యలను సీఎం కేసీఆర్ పరిష్కరించారని, ఇటీవల ఆయన దృష్టికి తీసుకెళ్లిన సమస్యలను పరిష్కరిస్తారని అన్నారు. సీఎం సభ జయప్రదానికి కారణమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు ఆంగోత్ బిందు, దిండిగాల రాజేందర్, ఎస్.రంగనాథ్, వరప్రసాద్, లక్ష్మణ్‌నాయక్, నాదెండ్ల శ్రీనివాసరెడ్డి, పరుచూరి వెంకటేశ్వర్లు, గిన్నారపు రాజేశ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ గెలిస్తే మరిన్ని పథకాలు

- దశాబ్దాల పోడు సమస్యను పరిష్కరించిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- రైతుబంధు, రైతుబీమా అందించిన బీఆర్ఎస్‌కు మద్దతునివ్వాలి
- బయ్యారం ఎన్నికల ప్రచారంలో ఇల్లెందు అభ్యర్థి హరిప్రియ


బయ్యారంలోని సాంబతండాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, జడ్పీ చైర్‌పర్సన్ బిందు

బయ్యారం, నవంబర్ 2: బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలవుతాయని ఇల్లెందు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి హరిప్రియానాయక్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గిరిజనుల సంక్షేమం సాధ్యమైందని గుర్తుచేశారు. తండాలను పంచాయతీలుగా చేసి అభివృద్ధికి బాటలు వేసిన సీఎం కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. బయ్యారం మండలంలో గురువారం పర్యటించిన ఆమె.. మహబూబాబాద్ జడ్పీ చైర్మన్ అంగోత్ బిందుతో కలిసి ఇసుకమేది, మిర్యాలపెంట, నారాయణపురం, లక్ష్మీపురం, కంబాలపల్లి, కోయ్యగూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దశాబ్దాల నాటి పోడు భూముల సమస్యను సీఎం కేసీఆర్ పరిష్కరించారని, అంతేగాక అదే పోడు భూములకు రైతుబంధు, రైతుబీమా అందించారని వివరించారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఇల్లెందు నియెజకవర్గంలోనే 48 వేల ఎకరాలకు పోడు భూములపై గిరిజనులకు హక్కులు కల్పించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతునివ్వాలని కోరారు. అనంతరం లక్ష్మీపురం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

# బీఆర్ఎస్ 'పేట' ఇన్‌చార్జ్‌గా 'ఉప్పల'



అశ్వారావుపేట, నవంబర్ 2 : నియోజవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌గా ఖమ్మం గ్రానైట్ అసోషియేషన్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణను అధిష్ఠానం నియమించింది. గతంలో ఆయన సిద్దిపేట, స్టేషన్ ఘన్‌పూర్, పరకాల, కరీంనగర్‌తో పాటు పలు ఉపఎన్నికల్లో ఇన్‌చార్జ బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. 'ఉప్పల' నియామకం పట్ల ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో పాటు జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, అశ్వారావుపేట, దమ్మపేట జడ్పీటీసీలు చిన్నంశెట్టి వరలక్ష్మి, పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# అందరి చూపు.. బీఆర్ఎస్ వైపే..

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు
- కాంగ్రెస్ నుంచి 100 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక
- గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన రేగా

బూర్గంపహాడ్, నవంబర్ 2 : ప్రజలందరి చూపు బీఆర్ఎస్ పార్టీ వైపే ఉందని.. పార్టీ, ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లోకి ఇతర పార్టీల నుంచి చేరుతున్నారని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో కాంగ్రెస్‌కు చెందిన సుమారు 100 కుటుంబాలు రేగా సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రేగా మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఆదరించి ఆశీర్వదించాలని, మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే నియోజకవర్గంలో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని.. తెలంగాణలో కేసీఆర్ సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామరక్షగా మారాయన్నారు. సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, మూడో సారి ముఖ్యమంత్రి కేసీఆరే అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీశ్, సర్పంచ్ భూక్యా శ్రావణి, ఉపసర్పంచ్ ఝాన్సీ, బిజ్జం శ్రీనివాసరెడ్డి, బిజ్జం వెంకట్రామిరెడ్డి, సానికొమ్ము శంకర్‌రెడ్డి, రెడ్డిపాలెం నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616